క్లుప్తంగా

ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియెట్ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యాలయంలో ఇంటర్మీడియెట్ ఎమ్ఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ రెండు గ్రూపులలో తరగతులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సుగంధలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త విభజనపై ఆట



ఆటలో పాల్గొన్న అధికారులు

హుస్నాబాద్: చెత్తతో ఎరువు తయారు చేసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బందికి చెత్త విభజనపై బుధవారం గేమ్ నిర్వహించారు. ఈ గేమ్‌లో తడి, పొడిచెత్త, హానికరమైన చెత్తకు కలర్ కోడ్ డబ్బాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు డ్రమ్మును ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి మిక్స్ వేస్ట్ ఇచ్చి చెత్తను వేరుచేసి ఒక్కొక్క డబ్బాలో వేయాలని సూచించారు. గేమ్‌లో 30 మంది పాల్గొనగా, ముగ్గురు వార్డు అధికారులు సాంబరాజు, మమత, పద్మ విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు



ఎంపికలు నిర్వహిస్తున్న ఎంఈఓ కృష్ణ

గజ్వేల్‌రూరల్: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించినట్లు ఎంఈఓ కృష్ణ తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ చాటిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారన్నారు. 24న జిల్లా స్థాయిలో జరిగే ఎంపికలకు పాల్గొంటారని, అక్కడ ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ భవాని, పీడీలు విజయరేఖ, రవికుమార్, నాగేశ్, ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశనాయక్‌తండా పంచాయతీ కార్యదర్శి మహేశ్‌పై మాజీ సర్పంచ్ భానోతు రవీందర్, మాజీ ఉప సర్పంచ్ లావుడ్యా భాస్కర్‌నాయక్‌లతోపాటు పలువురు తండావాసులు బుధవారం డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన పేర్లను కాదని తనకు నచ్చిన విధంగా ఎంపిక చేశారని వాపోయారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): రెండేళ్లుగా పూర్తికాని బెజ్జంకి–బేగంపేట రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని బేగంపేటలో గ్రామస్తులు బుధవారం ధర్నా చేశారు. మాజీ ఎంపీపీ చింతలపెల్లి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోయారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, శేఖర్‌బాబు, నరేశ్, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటేే భయంభయం

- మర్రిముచ్చాల కూడలి.. ప్రమాదాలకు నిలయం
- గ్రామస్తులకు అగ్ని పరీక్షే నిత్యం
- పట్టించుకోని అధికారులు
- బ్రిడ్జి నిర్మించాలంటున్న స్థానికులు

ప్రయాణం సుఖమయంగా సాగడానికి ట్రాఫిక్‌కు అనుగుణంగా విశాలమైన రోడ్లు నిర్మిస్తున్నా కొన్ని చర్యలు తీసుకోకపోవడంతో కూడళ్లలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు దాటడానికి స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతుంటారు. స్కూళ్లకు వెళ్లే చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది.



ప్రమాదాలకు నిలయంగా మారిన మర్రిముచ్చాల కూడలి

కొమురవెల్లి(సిద్దిపేట): నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సిద్దిపేట–జనగామ జాతీయ రహదారి(365బి)పై ఉన్న మర్రిముచ్చాల గ్రామ కూడలి ప్రమాదాలకు అడ్డాగా మారింది. డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి సంవత్సరం క్రితం విస్తరణ ప్రక్రియ చేపట్టారు. దీంతో పాటు మర్రిముచ్చాల గ్రామంలో రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టి గ్రిల్స్ బిగించారు. అయితే రోడ్డు దాటేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయకపోవంతో గ్రామస్తులు, వాహన దారులు గ్రామ కూడలిలో రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు.



సీసీ కెమెరాలో రికార్డయిన ఓ ప్రమాద దృశ్యం

ప్రమాదాలకు పిలుపు

ఈ కూడలిలో సంవత్సర కాలంలో ఇప్పటి వరకు సుమారు ఇరవైకిపైగా ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు అక్కడికక్కడే మరణించగా అనేక మంది గాయాలు పాలయ్యారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు జంకుతున్నారు. బడికి వెళ్లే చిన్నారుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటి వెళ్లేందుకు అండర్ పాస్ లేదా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

రోడ్డు దాటాలంటే హడలే..



గ్రామంలోని ఒక వైపు నుంచి మరోవైపునకు వెళ్లాలంటే రోడ్డు దాటాలి. రోడ్డు దాటాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటో తెలియని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి గ్రామంలో అండర్‌పాస్ లేదా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. అంత వరకు ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకోవాలి.
– చుంచు బాలనర్సయ్య, గ్రామస్తుడు

అంగన్‌వాడీలో ఆటపాటలతో విద్య

సీడీపీఓ రమాదేవి

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)బెజ్జంకి(సిద్దిపేట): అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని చేర్యాల సీడీపీఓ రమాదేవి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం కొమురవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా మద్దూరు మండలంలోని రేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ రామ్మోహన్ పిల్లలతో ఓనమాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాలలో పిల్లలకు అందుతున్న వివిధ సేవలు, ఆహారం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సూపర్‌వైజర్ నాగరాణి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మూడేళ్లు పూర్తయిన చిన్నారులను కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు జయలక్ష్మి, భూదేవి, కనకలక్ష్మి, కవిత, జమున తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ నాగరాణి

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో కొద్ది రోజుల క్రితం నిర్వహించిన తనిఖీలలో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.11వేల జరిమానా విధించింది.

డెంటల్ అసిస్టెంట్ సర్జన్ భర్తీకి ఇంటర్వ్యూ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో 21న ఉదయం 10.30 నుంచి నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



మంత్రికి పుష్పగుచ్ఛం అదజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డా.వివేక్ వెంకటస్వామిని బుధవారం సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

గజ్వేల్ సీఐ సైదా



గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్/తొగుట(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజలు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని గజ్వేల్ సీఐ సైదా సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మండల పరిధిలోని పిడిచెడ్, ర్యాగట్లపల్లి, అనంతరావుపల్లి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్), గజ్వేల్ యువకులు, ప్రజలకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే విధులు, రికార్డులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు అనర్థాలకు దారి తీస్తాయన్నారు. విద్యార్థి దశలో కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగం వచ్చే అవకాశం ఉండదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, సైబర్‌నేరం జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లారెడ్డి, ఏఎస్‌ఐ పండరి, హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థి దశలో ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు నేర్చుకోవడం చాలా ముఖ్యమని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిద్దిపేట ట్రాఫిక్ పీఎస్‌లో విద్యార్థులకు పోలీసుల విధుల నిర్వహణ, వినియోగిస్తున్న టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. తొగుట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో ఎస్‌ఐ వి.రమాకాంత్‌రావు సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాలను పోగొట్టుకోవద్దన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని అల్లీపూర్‌లో ఎస్‌ఐ బాలకృష్ణ ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ వెంకట్ గౌడ్, వాహనదారులు ఉన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

దిశ కమిటీ సభ్యుడు ప్రవీణ్ కుమార్

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించాలని దిశ కమిటీ సభ్యుడు సుంకోజి ప్రవీణ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ప్రిన్సిపాల్ స్వప్నను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు ఆయన విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రమేశ్‌రెడ్డి, రమణారెడ్డి, మనోజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్రిన్సిపాల్ స్వప్నతో మాట్లాడుతున్న ప్రవీణ్

విద్యార్థినికి అభినందనలు



చందన

చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థిని నిమ్మ చందనను పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఎస్‌ఎస్సీ ఫలితాలలో 555 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించి వరంగల్ టీజీఆర్‌ఎస్‌లో ప్రవేశం పొందింది. హెచ్‌ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆ ఆరోపణలు అవాస్తవం

ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి



మాట్లాడుతున్న జ్యోతిర్మయి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినుల యూనిఫారాల కోసం డబ్బులు వసూళ్లకు పాల్పడ్డామని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తల్లిదండ్రుల సమ్మతితోనే కుట్టించి అందజేశామని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. విద్యార్థినుల నుంచి యూనిఫారాల కోసం అధ్యాపకులు డబ్బులు తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోపై ప్రిన్సిపాల్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. యూనిఫారాలను బయట కుట్టించుకోవడం వల్ల ఎక్కువ డబ్బులు ఖర్చవుతున్నాయని, దానికితోడు ఆలస్యంగా ఇస్తున్నారని అందుకే తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి వారి అనుమతితోనే తక్కువ ధరలో దుస్తులను కుట్టించి విద్యార్థినులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక జతకు రూ.700, రెండు జతలకు రూ.1,400, ఐడీ కార్డుకోసం రూ.100 మాత్రమే తీసుకున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఐఈఓ రవీందర్‌ను వివరణ కోరగా డబ్బులు తీసుకొని దుస్తులు అందిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, తీసుకున్న డబ్బులను తిరిగి వారికి ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థినులకు ప్రభుత్వం యూనిఫారాలు ఇవ్వడంలేదని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు
- హుస్నాబాద్ ఏసీపీ సదానందం



అక్కన్నపేటలో స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

అక్కన్నపేట(హుస్నాబాద్) కొండపాక(గజ్వేల్) : దుబ్బాకటౌన్: హుస్నాబాద్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిపిస్తే కఠినచర్యలు తప్పవని హుస్నాబాద్ ఏసీపీ సదానందం హెచ్చరించారు. అక్కన్నపేట మండల కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. యువకులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని తొగుట సీఐ షేక్ లతీఫ్ కోరారు. రాయపోల్ మండలం అనాజీపూర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని హుస్నాబాద్‌రూరల్ ఎస్‌ఐ మహేశ్ సూచించారు. రాములపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో నేరాల నియంత్ర గురించి చర్చించారు. ఏ అన్యాయం జరిగిన నేరుగా పోలీసు స్టేషన్‌కు వస్తే న్యాయం చేస్తామని చెప్పారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ మండలంలోని మాత్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. సీసీ కెమెరాల తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రజలు స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్, పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: కేటీఆర్, హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కొలేకనే నోటీసులిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేటీఆర్‌కు నోటీసులు పంపి, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు నవాజ్‌మీర, ఊడెం కృష్ణారెడ్డి, అహ్మద్, స్వామిచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే కీలకం

భావిభారత సమాజ నిర్మాణానికి విద్యార్థులే కీలకమని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని బూర్గుపల్లిలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఊడెం వేమారెడ్డిల సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు రాజు, అబ్దుల్, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బకాయిలు చెల్లించండి

కార్మిక నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

సిద్దిపేటరూరల్: మున్సిపల్ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపల్‌లో పని చేసే 80 మంది కార్మికులకు గ్రూపులు ఏర్పాటు చేసి జీఓ నంబరు 60 ప్రకారం రూ.16,500 వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటించి వేతనాలు పెంచినప్పటికీ, నాలుగు నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించలేదని వాపోయారు. వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహులు, రాజయ్య, వినోద, విజయ, విమల, బాల్‌నర్సయ్య, శ్రీనివాస్, లత, బాలమని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల సమీపంలో అనేక ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని, వాటి పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ బుధవారం టీపీటీఎఫ్ ప్రతినిధులు కలెక్టర్ హైమావతిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇచ్చే సమయంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతనే అనుమతి ఇవ్వాలన్నారు. పేద పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్చుకునేందుకు అనేక రకాలుగా ఆకర్షిస్తూ, రైతులు, రోజువారీ కూలీలు సంపాదించుకునే డబ్బులను ప్రైవేట్ కార్పొరేట్‌లు దోపిడీ చేస్తున్నాయన్నారు. దీనివల్ల పేద కుటుంబాలు మరింతగా అప్పుల ఊబిలోకి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీలు అరికట్టడానికి వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అధిక ఫీజులపై నియంత్రణ అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ కొనసాగుతోందని, అధిక ఫీజుల వసూళ్లపై అధికారుల నియంత్రణ ఉండాలని డీసీసీ జనరల్ సెక్రటరీ ఎండీ షాబొద్దిన్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ఇష్టారీతిగా ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇచ్చారని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు దోపిడీకి గురవుతున్నారన్నారు. నాయకులు రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ రిజర్వాయర్‌లో దిగొద్దు

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మ రిజర్వాయర్ పరిసరాల్లోకి ప్రవేశాన్ని నిషేధించారని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం పెరుగుతోందని, ప్రమాదాలను తగ్గించడానికి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు.డ

◆ రైతు భరోసాపై గొప్ప నిర్ణయం

కొండపాక(గజ్వేల్): రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కార్యాలయంలో బుధవారం నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పరశురాములు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

◆ పౌష్టికాహారం, యోగాతో ఆరోగ్యం

ములుగు(గజ్వేల్): పౌష్టికాహారం, వ్యాయామం లాంటి అలవాట్లను విద్యార్థులు అలవర్చుకోవాలని సికింద్రాబాద్, సైనిక్‌పురి భవన్స్ కళాశాల విద్యార్థులు సూచించారు. స్టూడెంట్స్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ములుగు మండలం నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కాలుష్యం, అడవుల నరికివేత వివిధ సామాజిక సమస్యలపై చర్చించారు. మాజీ ఎంపీటీసీ నవ్యశ్రీ, హెచ్‌ఎం నర్సింహారెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మీదుగా పంతుల్‌తండాకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం తండావాసులు లావుడ్యా రైనా నాయక్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేకపోవడంతో మారుమూల తండాలైన ఫిక్కునాయక్, మంజూనాయక్, ధరావత్‌తండాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌నాయక్, తండావాసులు ఉన్నారు.

◆ యూనిఫారాలు సకాలంలో అందించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత యూనిఫారాలను ఐకేపీ ద్వారా సకాలంలో అందించాలని ఎంఈఓ ప్రవీణ్ బాబు కోరారు. యూనిఫామ్ క్లాత్‌ను మండల వనరుల కేంద్రంలో ఐకేపీ వీఓఏలకు బుధవారం ఆయన అందించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం డాకయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజలింగం, సీసీలు దాసు, వైకుంఠం, శ్రీనివాస్, బాలరాజు, వీఓఏలు మహేశ్, లక్ష్మి, మంగమ్మ, లావణ్య, శ్యామల, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ ఈఓగా శ్రీధర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఈఓగా శ్రీధర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓగా ఉన్న పీవీ శర్మ గత నెలలో పదవీ విరమణ పొందారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్, పూజారి మధుసూదనాచారి, రిటైర్డ్ ఈఓ పీవీ శర్మ, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

◆ చేర్యాల పీఎస్ పరిధిలో కలపండి

చేర్యాల(సిద్దిపేట): మద్దూరు మండలం నుంచి చేర్యాల మండలంలో కలిపిన కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలను చేర్యాల పీఎస్ పరిధిలోకి మార్చాలని గ్రామస్తులు హుస్నాబాద్ ఏసీపీ సదానందంగౌడ్‌ను కోరారు. కమలాయపల్లి గ్రామస్తులు బుధవారం ఆయనను కలిశారు. మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ శంకరాచారి, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లయ్య, నాయకులు రాజేశ్, కనకయ్య పాల్గొన్నారు.

◆ ఎడిటోరియల్ బోర్డు మెంబరుగా విజయ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘం అధికారిక మాస పత్రిక సంపాదక వర్గ సభ్యురాలిగా జిల్లాకు చెందిన విజయను రాష్ట్రశాఖ నామినేట్ చేసినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి శశిధర్‌శర్మ బుధవారం తెలిపారు. పీఆర్టీయూలో ఆమె మహిళా నాయకురాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న విజయ నామినేట్ కావడంపై హర్షం వ్యక్తం చేశారు.